సాక్షి
సంగారెడ్డి
బుధవారం । 18 । జూన్ । 2025



అడ్మిషన్ ఇవ్వండి మహాప్రభో

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని జెడ్పీ ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు బారులు తీరుతున్నారు.

వివరాలు 8లో ▸



అలంకారప్రాయంగా సీడీసీ

నాడు చెరకు రైతులతో కళకళలాడిన జహీరాబాద్‌లోని కేన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ నేడు నిస్తేజంగా మారింది.

వివరాలు 8లో ▸



గుంతలమయంగా..

అధికారుల నిర్లక్ష్యంతో జహీరాబాద్, ఝరాసంగంలోని ప్రధాన రహదారి గుంతలమయంగా మారి వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కల్హేర్(నారాయణఖేడ్): రైతు భరోసా డబ్బులు జమచేయడంతో కల్హేర్‌లో మంగళవారం కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోచయ్య, నాయకులు దేవదాస్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పదోన్నతితో మరింత బాధ్యత

అదనపు ఎస్పీ సంజీవరావు



చైతన్యను సన్మానిస్తున్న సంజీవరావు

సంగారెడ్డి జోన్: పదోన్నతితో విధి నిర్వహణలో మరింత బాధ్యత పెరుగుతుందని జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన చైతన్య సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది సైబరాబాద్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కల్యాణి, అధికారులు అశోక్, వెంకటేశం, సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సేవలు అందిస్తాం: ఎస్‌ఇ శంకర్

పాపన్నపేట(మెదక్): జిల్లాలో వినియోగదారులకు నిరంతర విద్యుత్ సేవలు అందిస్తామని విద్యుత్ శాఖ ఎస్‌ఇ శంకర్ తెలిపారు. పాపన్నపేటలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో 125 విద్యుత్ సబ్ స్టేషన్లున్నాయన్నారు. అభివృద్ధి పనుల కోసం జిల్లాకు రూ.50 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.జిల్లాలో విద్యుత్ పరికరాలు అందించేందుకు ప్రభుత్వం 5 ఎకరాల భూమి కేటాయించిందన్నారు. లైన్‌మెన్‌లు నిరంతర సేవలు అందించేందుకు వారికి సెల్‌ఫోన్లు అందజేసినట్లు చెప్పారు. ప్రతీరోజు 587 మెగావాట్ల విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు.

మహిళా సంఘాల సేవలు భేష్



ఇస్మాయిల్ ఖాన్ పేటలో మహిళా సమాఖ్య కార్యాలయం సభ్యులతో రాజస్థాన్ అధికారులు

సంగారెడ్డి టౌన్: జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాల శిక్షణలో జిల్లాలోని సంఘాలకు విశేష గుర్తింపు ఉంటుందని రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన జెండర్ అధికారులు పేర్కొన్నారు. సంగారెడ్డి మండలంలోని ఇస్మాయిల్ ఖాన్ పేటలో మంగళవారం రాజస్థాన్ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా స్థిరపడేందుకు వివిధ పథకాలతో లబ్ధి పొందుతున్నారని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలు ఉపాధి పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండి సామాజిక అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సామాజిక సంఘ సేవకురాలు దేవి, డీఆర్‌డీఏ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతే లక్ష్యం



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న జగ్జీవన్

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం ఇందిరానగర్ కాలనీలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేపడతామన్నారు. చెత్తను ఇళ్లు, దుకాణాల వద్దకు వచ్చే చెత్త తరలింపు వాహనాల్లోనే వేయాలన్నారు. ఆయన వెంట మేనేజర్ వెంకటశివయ్య, శానిటరీ అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

ప్రావీణ్యం చూపేనా?



కలెక్టర్‌కు రెవెన్యూ సవాల్

- జిల్లాలో తరచూ భూ కుంభకోణాలు
- విలువైన సర్కారు, అసైన్డ్ భూములు అన్యాక్రాంతం
- హెచ్‌ఎండీఏ మండలాల్లో పాతుకుపోయిన కొందరు తహసీల్దార్లు
- సొంత శాఖ ప్రక్షాళన తక్షణం అవసరమనే అభిప్రాయం!

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: నూతన కలెక్టర్‌గా నియమితులైన ప్రావీణ్యకు తన సొంత శాఖ రెవెన్యూ శాఖ పనితీరే సవాల్‌గా మారనుందా? సర్కారు భూములు అన్యాక్రాంతం కావడానికి సహకరిస్తూ రూ.కోట్లు దండుకుంటున్న కొందరు రెవెన్యూ అధికారులకు చెక్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందా? రాజకీయ అండదండలతో జిల్లాలో పాతుకుపోయిన వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయక తప్పదా? అంటే అవుననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కలెక్టర్‌గా ప్రావీణ్య ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. కలెక్టర్ ముందుగా తన సొంత శాఖనే చక్కదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలో కొందరు రెవెన్యూ అధికారుల పనితీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు అన్యాక్రాంతం కావడంలో ఈ అధికారులు కీలకంగా వ్యవహరిస్తున్నారనేది బహిరంగ రహస్యం. ప్రత్యక్షంగా, పరోక్షంగా వారికి సహరించి రూ.కోట్లు దండుకుంటున్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని మండలాలతోపాటు, ముంబై నేషనల్ హైవేపై ఉన్న మండలాల్లో తరచూ వెలుగు చూస్తున్న భూ ఆక్రమణలే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

హైడ్రా కూల్చివేతలే ఇందుకు నిదర్శనం

ప్రభుత్వ భూములను కాపాడటం రెవెన్యూ అధికారుల విధి. సర్కారు భూములు కబ్జాకు గురవుతుంటే కళ్లు మూసుకున్నందుకు కూడా అధికారులకు కాసుల వర్షం కురుస్తోంది. జిల్లాలో హైడ్రా కూల్చివేతలే ఇందుకు నిదర్శనం. ప్రధానంగా అమీన్‌పూర్, పటాన్‌చెరు మండలాల్లో హైడ్రా పెద్ద ఎత్తున కూల్చివేతలు చేసింది. అక్రమ కట్టడాలను ప్రారంభంలోనే అడ్డుకోకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటనే ప్రశ్న ఉదయిస్తోంది. ఇలాంటి భూదందాలపై కలెక్టర్ చర్యలు ఏ మేరకు ఉంటాయనేది రానున్న రోజుల్లో తేలనుంది.

జవాబుదారీతనం ఏదీ?

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇక్కడకు వచ్చే వినతుల్లో 70% రెవెన్యూశాఖకు సంబంధించినవే ఉంటున్నాయి. ధరణి పోర్టల్‌కు సంబంధించి భూసమస్యల పరిష్కారం కోసం సాధారణ రైతులు చెప్పులరిగేలా తిరుగుతున్నారు. బడాబాబుల ధరణి సమస్యలు తక్షణం పరిష్కరించే కొందరు అధికారులు సాధారణ రైతులను మాత్రం చెప్పులరిగేలా తిప్పుకుంటున్నారని బాధితులు వాపోతున్నారు. సాధారణ రైతుల పట్ల కనీసం జవాబుదారీతనం లేకుండా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వం మారినా ప్రైమ్ లొకేషన్లలోనే..

తహసీల్దార్ల పోస్టింగ్‌లు తరచూ చర్చనీయాంశమవుతున్నాయి. కొందరు ఏళ్ల తరబడి హెచ్‌ఎండీఏ మండలాలు, ముంబై హైవేపై ఉన్న మండలాల్లోనే పోస్టింగ్‌లు పొందుతున్నారు. బదిలీలు జరిగినప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో వేరే పోస్టింగ్‌లు వచ్చినా.. తమ రాజకీయ సంబంధాలను ఉపయోగించి కొద్దిరోజుల్లోనే తిరిగి రియల్ ఎస్టేట్ వెంచర్లు, సర్కారు భూములు, చెరువులు, కుంటల కబ్జాలు ఎక్కువగా ఉండే ఈ మండలాల్లోనే చేరిపోతున్నారు. ఈ మండలాల్లో రెండు, మూడేళ్లు పనిచేస్తే చాలు భారీగా వెనుకేసుకోవచ్చనేది ఆయా అధికారుల అభిప్రాయంగా ఉంటుందనేది బహిరంగరహస్యం. గత ప్రభుత్వ హయాంలో కీలక మండలాల్లో పని చేసిన తహసీల్దార్లు ఈ ప్రభుత్వ హయాంలోనూ ప్రైమ్ లొకేషన్లలోనే ఉంటున్నారు. ఇలాంటి అధికారుల తీరుతో కాస్త నిక్కచ్చిగా పనిచేసే అధికారులకు చెడ్డ పేరు వస్తోందని వాపోతున్నారు.

ప్రశాంత వాతావరణంలో విద్యాబోధన

జెడ్పీ సీఈఓ ఎల్లయ్య



చేగుంట ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

చేగుంట(తూప్రాన్)/చిన్నశంకరంపేట(మెదక్): ప్రశాంత వాతావరణంలో విద్యా బోధన జరపాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య పేర్కొన్నారు. చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న వసతులతోపాటు విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలతోపాటు మధ్యాహ్న భోజనం గురించి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. అనంతరం చిన్నశంకరంపేట మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి కార్యాలయ రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పాఠశాల బోధనను స్నేహపూర్వకంగా తీర్చిదిద్దాలని సూచించారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థుల సంఖ్య పెంపు, బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధచూపడం తదితర అంశాలను గురించి వివరించారు. గ్రామాలలో పారిశుద్ధ్య, తాగునీటి సమస్యలు రాకుండా గ్రామ అధికారులు చూసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు చిన్నారెడ్డి, దామోదర్, ఎంఈఓ నీరజ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరు స్కూల్ బస్సుల సీజ్

తూప్రాన్: ఫిట్‌నెస్ లేని ఆరు ప్రైవేట్ స్కూల్ బస్సులను పోలీసులు సీజ్ చేశారు. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాల్సిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలను జిల్లా అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావుతో కలిసి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒలంపియా స్కూల్‌కు చెందిన నాలుగు బస్సులు, ఐడియాల్ స్కూల్, అక్షర స్కూల్‌కు చెందిన ఒక్కో బస్సును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు. ప్రతీ పాఠశాలలో బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు.



బస్సులను సీజ్ చేసిన పోలీసులు

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

జిల్లా విద్యాధికారి రాధాకిషన్



అద్మాపూర్ ప్రాథమిక పాఠశాల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా విద్యాధికారి

నర్సాపూర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తున్నామని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. నర్సాపూర్ మండలంలోని అద్మాపూర్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయుల ద్వారా మెరుగైన విద్యాబోధన అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో ఉన్న సమస్యలను హెచ్‌ఎం రవిరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నూతన భవనం కోసం అంచనా ప్రతిపాదనలు తయారు చేయాలని ఏఈకి ఫోన్ ద్వారా సూచించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి తారాసింగ్, సీఆర్పీ భైరవరెడ్డి ఉన్నారు.

కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి శూన్యం

హత్నూర (సంగారెడ్డి): నర్సాపూర్ నియోజకవర్గంలో బీజేపీ పుంజుకుందని, కొంతమంది బడా నాయకులు బీజేపీ కార్యకర్తలను బెదిరించాలని చూస్తే ఖబడ్దార్ అని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు హెచ్చరించారు. నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాషాయ పార్టీ జెండా ఎగరనుందని జోస్యం చెప్పారు. హత్నూర మండలం బోరపట్ల గ్రామంలో మంగళవారం ఆయన బీజేపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కార్యకర్తల జోలికొస్తే తాను ప్రత్యక్షంగా ప్రతీ గ్రామానికి వచ్చి నిలబడతానని తెలిపారు. బోరపట్ల గ్రామ శివారులోని కాలుష్యాన్ని వెదజల్లుతూ పరిశ్రమను విస్తరించుకుంటుందే తప్ప స్థానికులకు ఉద్యోగాలు కల్పించడంతో వివక్ష చూపుతోందన్నారు. బోరుపట్ల గ్రామస్తులకు ఉద్యోగాలను వెంటనే పర్మినెంట్ చేయాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందలేదు కానీ, అవినీతి పెరిగిపోయిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు ఎన్నికల హామీల అమలులో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా ఏంటో తెలుస్తుందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నుంచి బోరుపట్ల లింగాపూర్ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు రఘునందరావు సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్, మండల శాఖ అధ్యక్షుడు నాగప్రభుగౌడ్, నాయకులు మహేశ్, సురేశ్, నాగరాజుగౌడ్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



వల్లూరు క్రాంతిని సన్మానిస్తున్న అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు

మీ సహకారం మరువలేనిది

వీడ్కోలు సభలో మాజీ కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: జిల్లాలో కలెక్టర్‌గా విధులు నిర్వహించిన 17 నెలల కాలంలో అందరి సహకారంతోనే ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడం సాధ్యమైందని, మీరందరూ అందించిన సహకారం మరువలేనిదని మాజీ కలెక్టర్, రాష్ట్ర టూరిజం శాఖ ఎండీ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. కలెక్టర్ నుంచి రాష్ట్ర టూరిజం శాఖ ఎండీగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో వీడ్కోలు సభను ఏర్పాటు చేసి ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వల్లూరు క్రాంతి మాట్లాడుతూ... పార్లమెంటు ఎన్నికల సమయంలో అందరి సహకారంతోనే విజయవంతంగా నిర్వహించామన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రస్థాయిలో జిల్లాను అగ్రస్థానంలో నిలపడానికి సహకరించిన ఉద్యోగులకు క్రాంతి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ సేవలు విస్తరణ

నైబర్ హుడ్ కేంద్రంతో భవిత కేంద్రం అనుసంధానం



భవిత కేంద్రంలో చిన్నారులతో వెంకటేశం

నారాయణఖేడ్: ఖేడ్‌లోని భవిత కేంద్రాన్ని నైబర్ హుడ్ కేంద్రంతో అనుసంధానం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వికలాంగుల సేవాకేంద్రం, సమగ్రశిక్ష ద్వారా సేవలను విస్తరించినట్లు జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష విలీనవిద్య సమన్వయకర్త వెంకటేశం తెలిపారు. బడిబాటలో భాగంగా ఖేడ్‌లోని భవిత కేంద్రంలో మంగళవారం సమ్మిళిత విద్యాదినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ, ఎస్కార్ట్, రవాణా, రీడర్ అలవెన్సులను, స్టైపెండ్, సహాయ ఉపకరణాలు, అభ్యాసన సామగ్రి పంపిణీ, ఉపకార వేతనాలను అందిస్తున్నామన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ప్రతీ శనివారం ఇంటివద్దనే విద్య అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో భవిత కేంద్రాల సమన్వయకర్త సుప్రియ, ఖేడ్, నాగల్‌గిద్ద ఎంఈఓలు విశ్వనాథ్, మన్మథకిశోర్ పాల్గొన్నారు.

నీరు నిల్వ ఉండకుండా చూడాలి

మలేరియా అధికారి ప్రవీణ్ కుమార్



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని జిల్లా మలేరియా అధికారి(డీఎంఓ) ప్రవీణ్ కుమార్ ప్రజలకు సూచించారు. మండల పరిధిలోని గంగ్వార్‌ను మంగళవారం సందర్శించి స్థానికుల ఇళ్లను పరిసరాలను పరిశీలించారు. మధ్యాహ్నం గ్రామానికి వచ్చిన ఆయన వైద్య సిబ్బందితో కలసి 115 ఇళ్లను పరిశీలించారు. ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంటి పరిసరాల్లోని కుళాయిలు, వాటర్ ట్యాంక్‌లు, పూల కుండీలు తదితరాల్లో నీరు నిల్వ ఉండకుడా చూడాలని ప్రజలకు సూచించారు. నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండటం వల్ల దోమలు పెరిగిపోయి డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యాధులు సోకుండా తీసుకోవలసిన జాగ్రతలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

అందరికా.. కొందరికా?

ఖాతాల్లోకి రైతు భరోసా

- మొదటి విడతగా మూడెకరాల లోపు వారికి జమ
- ఉమ్మడి జిల్లాలో 8.38లక్షల ఎకరాలకు రూ.502 కోట్లు
- గత యాసంగిలో 2.27లక్షల మంది దూరం
- ఈ సారైనా పూర్తి స్థాయిలో అందేనా?



ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సాయం 'రైతు భరోసా' కొందరికా? లేక అందరికా? అన్న చర్చ జోరుగా సాగుతోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో 17,18,981 ఎకరాలకు రూ.859 కోట్లకుపైగా రైతు బంధును అందించేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత యాసంగిలో 4ఎకరాలలోపు వారికే రైతు భరోసా జమ చేసింది. దీంతో 40శాతం మంది రైతులు పెట్టుబడి సాయానికి దూరమయ్యారు. ఈసారి వానాకాలంలోనైనా అందరికీ జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

– సాక్షి, సిద్దిపేట

గత యాసంగిలో రైతు భరోసా ఇలా..				ప్రస్తుతం అందిన రైతు భరోసా ఇలా..			
జిల్లా	రైతులు	ఎకరాలు	రూ.కోట్లల్లో	జిల్లా	రైతులు	ఎకరాలు	రూ.కోట్లల్లో
సిద్దిపేట	2,62,238	3,33,238	199,94,28,372	సిద్దిపేట	2,54,711	3,02,418	181,45,13,296
మెదక్	2,26,970	2,34,500	140,70,00,000	మెదక్	2,25,764	2,24,319	134,59,15,589
సంగారెడ్డి	2,67,236	3,33,416	200,05,00,000	సంగారెడ్డి	2,65,400	3,11,292	186,77,56,219

ఉమ్మడి మెదక్ జిల్లాలో 9,83,735 మంది రైతులకు 17,18,981 ఎకరాలు ఉండగా.. గత ప్రభుత్వం రూ.859,49,05,000 రైతు బంధు జమ చేసింది. ప్రస్తుత ప్రభుత్వం గత యాసంగిలో రైతు భరోసాను ఎకరానికి రూ.6వేల చొప్పున అందించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో 7,56,444 రైతులకు 9,01,154 ఎకరాలకుగాను రూ.540,69,28,372 రైతు భరోసా జమ చేసింది. దాదాపు 4 ఎకరాల లోపు వారికే రైతు భరోసా జమ చేయడంతో 2,27,291 మంది భరోసాకు దూరమయ్యారు.

8.38లక్షల ఎకరాలు.. రూ.502 కోట్లు

ప్రస్తుత వానాకాలానికి సంబంధించి మూడెకరాల వరకు భూమి ఉన్న వారికి రైతు భరోసా బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,45,875 మంది రైతులకుగాను.. 8,38,029 ఎకరాలకు రూ.502,81,85,104 జమ అయ్యాయి. మొదట రెండు ఎకరాల వారికి, మంగళవారం మూడెకరాల వరకు రైతు భరోసా అందించారు. గత యాసంగి మాదిరిగానే ఈసారి దాదాపు 4 ఎకరాల భూమి ఉన్న వారికే రైతు భరోసా జమ చేస్తారా? అందిరికీ అందిస్తారా అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. సాగులో ఉన్న రైతులందరికీ భరోసాను అందించాలని కోరుతున్నారు.

అర్హులందరికీ అందిస్తాం



ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన రైతులందరికీ రైతు భరోసా జమ చేస్తున్నాం. రైతు భరోసా కోసం కొత్త పట్టాదారులు స్థానిక ఏఈఓలను బ్యాంక్ వివరాలతో సంప్రదించాలి. అలాగే బ్యాంకు ఖాతా సమస్యలున్న వారు సైతం కలిసి వివరాలు అందించాలి.

– రాధిక, డీఏఓ, సిద్దిపేట

క్లుప్తంగా

కోతుల దాడిలో చిన్నారికి గాయాలు



దాడిలో గాయపడ్డ చిన్నారి అమూల్య

నారాయణఖేడ్: రోజు రోజుకు ఖేడ్ పట్టణంలో కోతుల బెడద అధికం కావడంతో పట్టణ వాసులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సత్యసాయి కాలనీ సమీపంలో నివాసం ఉంటున్న రాజిరెడ్డి కూతురు అమూల్య (4) చిన్నారి ఆడుకుంటుండగా మంగళవారం కోతులు దాడి చేశాయి. ఎడమ చేయికి కరవడంతో తీవ్ర గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఖేడ్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆరుబయట కూర్చోవాలన్నా, చిన్నపిల్లలు ఆడుకుంటున్నా, మహిళలు ఒకరిద్దరు ఉన్నా దాడులకు తెగబడుతున్నాయని కాలనీ వాసులు వాపోయారు. అధికారులు స్పందించి కోతుల బెడదను నివారించాలని కోరుతున్నారు.

ట్రాక్టర్ ఇంజిన్ బోల్తా
ప్రాణాలతో బయటపడిన వ్యక్తి



బోల్తా పడిన ట్రాక్టర్ ఇంజిన్‌ని పైకిలేపుతున్న జేసీబీ

శివ్వంపేట(నర్సాపూర్) : ట్రాక్టర్ ఇంజిన్ బోల్తా పడిన ఘటనలో వ్యక్తి ప్రాణాలతో బయట పడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మియ్యాడి శ్రీనివాస్ తన సొంత ట్రాక్టర్‌తో పొలం దున్నకం చేపట్టి ఇంటికి వస్తుండగా బురదబాట వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. శ్రీనివాస్ స్టీరింగ్‌ని గట్టిగా పట్టుకుని ఉండటంతో బోల్తా పడినప్పటికీ అందులో ఇరుక్కుపోయాడు. గుర్తించిన స్థానిక రైతులు జేసీబీతో ట్రాక్టర్ ఇంజిన్‌ను పైకి లేపి శ్రీనివాస్‌ని బయటకు తీశారు. స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

నిజాంపేట(మెదక్): అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వల్లకాటి శ్రీనివాస్(51) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికి తోడు భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్య సరిత, కూతురు, కొడుకును తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఉరివేసుకున్నాడు. మృతుని తమ్ముడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేశ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు
పట్టించుకోని అధికారులు



పంట పొలాల వద్ద వేలాడుతున్న విద్యుత్ తీగలను చూపుతున్న రైతులు

మనోహరాబాద్(తూప్రాన్): రైతుల పంట పొలాల మీదుగా ఉన్న విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ యమపాశాలుగా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కాళ్లకల్ గ్రామ శివారులోని గార్లకుంట పరిసర పొలాల్లో ఉన్న విద్యుత్ తీగలు చేతికి తగిలేలా వేలాడుతున్నాయని తెలిపారు. వాటిని సరిచేయాలని, విద్యుత్ అధికారులు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మోడల్ విద్యార్థికి రాష్ట్రస్థాయి ర్యాంకు

ఝరాసంగం(జహీరాబాద్): తెలంగాణ మోడల్ కళాశాల విద్యార్థి పురం అక్షిత రెడ్డి ఇంటర్మీడియట్ సప్లమెంటరీ ఫలితాల్లో 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించింది. మంగళవారం కళాశాలలో విద్యార్థికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేనా వతి అభినందించి, సన్మానించారు.

అడ్మిషన్ ఇవ్వండి మహాప్రభో..

సర్కారు బడుల ఎదుట విద్యార్థుల క్యూ

- కొల్లూరు డబుల్ బెడ్రూం సముదాయంలో 3వేల మంది
- పిల్లల భవిష్యత్ ఏంటని తల్లిదండ్రుల ఆందోళన
- పట్టించుకోని అధికారులు



అడ్మిషన్‌ల కోసం తెల్లాపూర్ జెడ్పీ పాఠశాల ఎదుట నిలబడిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించి చిన్నారులను పాఠశాలలో చేర్పించుకుంటున్నారు. కానీ ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా తయారైంది. మాకు అడ్మిషన్‌లు కావాలి మహాప్రభో అని నిత్యం వందలాది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల ఎదుట ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అయినా నో అడ్మిషన్ అని చెప్పడంతో వారు ఆందోళన చెందుతున్నారు. మరి కొందరు ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయిస్తున్నారు.

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో గత ప్రభుత్వం నిరుపేదల కోసం కొల్లూరులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించారు. ఫేస్– 1 డిగ్నిటీ కాలనీలో 2052, ఫేస్ –2 కేసీఆర్ నగర్‌లో 15,660 ఇళ్లను నిర్మించి పేదలకు కేటాయించారు. ఈ ఇళ్లలో ప్రస్తుతం పూర్తి స్థాయిలో లబ్ధిదారులు వచ్చారు. ఈ నివాసాల్లో సుమారు 3వేల మంది విద్యార్థులు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

ఉన్నత పాఠశాల లేక ఇబ్బందులు

కేసీఆర్ నగర్‌లో అధికారులు తాత్కాలికంగా గదులు కేటాయించి ప్రాథమిక పాఠశాల నిర్వహిస్తున్నారు. చిన్నారుల కోసం అంగన్‌వాడీ కేంద్రాలు సైతం ఏర్పాటు చేశారు. డబుల్ బెడ్రూం సముదాయం నిర్మించేటప్పుడు పక్కనే ఒక ఎకరం స్థలం పాఠశాల కోసం కేటాయించారు. కానీ అందులో ఎలాంటి నిర్మాణం చేయలేదు. ఉన్నత పాఠశాల లేకపోవడంతో 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు ఎక్కడ చదువుకోవాలో అర్థం కాక సతమతమవుతున్నారు.

నో అడ్మిషన్స్..

డబుల్ ఇళ్ల సముదాయానికి కొల్లూరు జెడ్పీ పాఠశాల దగ్గరలో ఉంటుంది. అక్కడ విద్యార్థులకు సరిపడ సౌకర్యాలు లేకపోవడంతో అడ్మిషన్‌లు ఇవ్వడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాత్రం వచ్చిన విద్యార్థులకు అడిష్మన్‌లు ఇస్తున్నామని తెలిపారు. చాలా మంది విద్యార్థులు తెల్లాపూర్ జెడ్పీ పాఠశాలలో అడ్మిషన్‌ల కోసం క్యూ కడుతున్నారు. అక్కడ ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ సుమారు 150 మంది విద్యార్థులకు అడ్మిషన్‌లు ఇచ్చి చేసేదీ ఏమి లేక చేతులెత్తేశారు. దీంతో తమ పిల్లల భవిష్యత్ ఏమిటని తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. తమ సమస్యను పట్టించుకొని న్యాయం చేయాలని కోరుతున్నారు.

ముందు చూపు లేని అధికారులు

కొల్లూరు డబుల్ బెడ్రూం ఇళ్లలో విద్యార్థులు ఉంటారని తెలిసి కూడా అధికారులు ముందస్తుగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం సమీప గ్రామాల్లోని పాఠశాలల్లో చేర్పించే విధంగా కూడా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని వారికి న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అడ్మిషన్‌లు ఇస్తలేరు



నాకు ఇద్దరు పిల్లలు. ఒక్కరు 8వతరగతి మరొకరు 9వతరగతి చదువుతున్నారు. అడ్మిషన్‌ల కోసం ప్రభుత్వ పాఠశాలల చుట్టూ తిరుగుతున్న. అడ్మిషన్‌లు మాత్రం ఇవ్వడం లేదు. దీంతో పిల్లల భవిష్యత్ ఏంటని ఆందోళనకు గురవుతున్నం.

– పి.పర్వత్ రెడ్డి, డబుల్ బెడ్‌రూమ్ నివాసి

ప్రత్యేక చర్యలు తీసుకుంటాం



డబుల్ బెడ్‌రూమ్‌లో నివాసం ఉండే విద్యార్థులందరికీ అడ్మిషన్‌లు ఇవ్వాలని చెప్పాం. ఇస్తున్నాం కూడా. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి

ఉద్యాన పంటల విస్తీర్ణం పెరగాలి

కొండా లక్ష్మణ్ ఉద్యానవర్సిటీ వైస్ చాన్స్‌లర్ రాజిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రాజిరెడ్డి

ములుగు(గజ్వేల్): సాంకేతిక, ఆర్థిక కుటుంబాల ఆధారంగా గ్రామాల వారీగా ఉద్యాన పరిశోధన ప్రణాళికలు సిద్ధం చేయాలని ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యానవర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దండా రాజిరెడ్డి పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం అధికారులతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పరిశోధన, సాంకేతిక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే 5 నుంచి పదేళ్లలో రాష్ట్ర అవసరాలను తీర్చేలా ప్రణాళికలు ఉండాలన్నారు. రాష్ట్రంలో ఉద్యాన పంటల విస్తీర్ణం 12.94 లక్షల ఎకరాల నుంచి 20 లక్షల ఎకరాలకు పెరగాలని సూచించారు. ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తూనే హైటెక్ హార్టికల్చర్ దిశగా దిశా నిర్దేశం ఉండాలని రాజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అధికారులు మనోహర్‌రావు, ఉమాదేవి, చీనా నాయక్, లక్ష్మీనారాయణ, సురేష్‌కుమార్, రాజశేఖర్, శ్రీనివాసన్, విజయ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బాలయ్య (ఫైల్)

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన బోయిన బాలయ్య (58) తన భార్యతో కలిసి నిక లెక్చరర్స్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. తన ఇంటికి సమీపంలో రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజు మాదిరిగానే బాలయ్య తన ద్విచక్ర వాహనంపై కూరగాయలు తేవడానికి పట్టణంలోని రైతు బజార్‌కు మంగళవారం తెల్లవారుజామున బయలుదేరాడు. ఈ క్రమంలో ముస్తాబాద్ చౌరస్తా వద్ద ప్రభుత్వ ఆస్పత్రి వైపు వెళ్తున్న లారీ అతడిని ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శుభకార్యానికి వెళ్లి వస్తూ...

చేగుంట(తూప్రాన్): శుభ కార్యానికి వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పులిమామిడి గ్రామ శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామానికి చెందిన చంద్రయ్య(50) తన కుమారుడు పర్శరాములుతో కలిసి రామాయంపేట మండలం ధర్మారం గ్రామంలోని బంధువుల ఇంటికి బైకుపై వెళ్లారు. సోమవారం రాత్రి తిరుగు ప్రయాణంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బైకును ఢీకొట్టగా చంద్రయ్య తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలైన పర్శరాములును చికిత్స నిమిత్తం సిద్దిపేటకు తరలించారు. చంద్రయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ కష్టాలు

స్టాక్ రాకపోవడంతో దుకాణాల వద్ద జనం పడిగాపులు

రామాయంపేట(మెదక్): మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో నిరుపేదలు ఇబ్బందులపాలవుతున్నారు. రేషన్ దుకాణాలకు సక్రమంగా బియ్యం స్టాక్ సరఫరా కాకపోవడంతో వినియోగదారులు గంటల తరబడి దుకాణాలవద్ద పడిగాపులు కాస్తున్నారు. రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిది రేషన్ దుకాణాలకుగాను ఒక దుకాణానికి తప్పించి మిగతా దుకాణాలకు రెండో విడత బియ్యం సరఫరా కాలేదు. రెండు, మూడు కోటాలకు సంబంధించి బియ్యం స్టాక్ ఒకే దుకాణానికి ఇవ్వడంతో సదరు దుకాణానికి మంగళవారం వినియోగదారులు పోటెత్తారు. క్యూలో నిల్చునే ఓపిక లేకపోవడంతో చాలామంది బియ్యం కోసం తెచ్చిన సంచులను క్యూలో ఉంచారు. తమకు బియ్యం స్టాక్ రాకపోవడంతో డీలర్లు స్థానికంగా ఉన్న సివిల్ సప్లై గోదాం వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ఒకే రేషన్ దుకాణానికి స్టాక్ ఎలా పంపుతారని అక్కడి అధికారులను నిలదీశారు. మిగతా దుకాణాలకు వెంటనే స్టాక్ పంపిస్తామని వారు పేర్కొన్నారు.

పది సంచుల బియ్యం మాయం

సివిల్ సప్లై గోదాంనుంచి పది సంచుల బియ్యం అపహరణకు గురయ్యాయి. లెక్కల్లో తేడా రావడంతో ఖంగుతిన్న అధికారులు రికార్డులు పరిశీలించగా ఈవిషయం బయటపడింది. స్థానికంగా ఒక డీలర్‌కు పది సంచులు ఎక్కువ వేసినట్లు తేలింది. ఈ విషయమై ఆర్ఐ గౌస్ గోదాంకు వచ్చి విచారణ జరిపారు. పది సంచులు తక్కువ ఉన్నట్లు తేలిందని ఆయన పేర్కొన్నారు. ఎక్కువ బియ్యం వేసిన డీలర్ వద్ద నుంచి ఆసంచులు రికవరీ చేయాలని సూచించారు.



రేషన్ దుకాణం ఎదుట సంచులను వరుసలో ఉంచిన లబ్ధిదారులు



గోదాంలో అధికారులతో డీలర్ల వాగ్వాదం

అటవీ భూమి కబ్జా చేసిన వ్యక్తిపై కేసు

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండలం పరిధిలో అటవీ భూమిని కబ్జా చేసిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కుతుబుద్దీన్ తెలిపారు. అవుసులపల్లి అటవీ భూమిని ట్రాక్టర్‌తో ఎలాంటి అనుమతులు లేకుండా చదును చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం వచ్చింది. దీంతో అక్కడికి వెళ్లి చూడగా కబ్జా చేస్తున్నారని తెలిపారు. అవుసులపల్లికి చెందిన దేవయ్య, ట్రాక్టర్ యజమాని సుభాష్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్ సీజ్ చేశామని అధికారి పేర్కొన్నారు. వేణు, కిరణ్, తదితరులు ఉన్నారు.

యువకుడి అదృశ్యం

రామాయంపేట(మెదక్): బీహార్‌కు చెందిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పట్టణ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... ఇటీవల బీహార్‌కు చెందిన తొమ్మిది మంది రామాయంపేటలో కూలీ పనుల నిమిత్తం వచ్చారు. వారిలో సురేందర్ పాశ్వాన్ (19) సోమవారం రాత్రి తాము కిరాయి ఉంటున్న ఇంటినుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. అతని వెంట వచ్చిన వారు సురేందర్ ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేదు. దీంతో వారు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుంటకట్ట కబ్జా చేసిన వ్యక్తిపై కేసు

తూప్రాన్: పట్టణ పరిధిలోని అల్లాపూర్ శివారు ప్రభుత్వ కుంట కట్టను కబ్జా చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం మంగళవారం తెలిపారు. అల్లాపూర్ శివారులోని సర్వునుకుంట కట్టను గ్రామానికి చెందిన ఇసూరి గోవర్ధన్ అక్రమంగా కబ్జా చేసినట్లు ఇరిగేషన్ ఏఈఈ సురేష్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చదువుకుందామని వచ్చి..

- చెరువులో మునిగి బాలిక మృతి
- దానంపల్లిలో ఘటన



నవ్యశ్రీ మృతదేహం

చేర్యాల(సిద్దిపేట): సరదాగా చెరువులోకి దిగిన బాలిక ఈత రాకపోవడంతో మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని దానంపల్లిలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్ఐ నీరేష్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కొండం భవాని భగవాన్‌రెడ్డి దంపతులు బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు నవ్యశ్రీ(12)ని నర్మెట్ట కేజీబీవీ హాస్టల్‌లో 6వ తరగతిలో చేర్పించేందుకు తల్లి భవాని స్వగ్రామానికి తీసుకొచ్చింది. బుధవారం హాస్టల్‌కు వెళ్లాల్సి ఉండగా మంగళవారం మధ్యాహ్నం వారి వ్యవసాయ బావి వద్దకు తల్లి భవాని, చెల్లి రిత్విక, తమ్ముడు హర్షవర్ధన్‌రెడ్డి, పిన్ని నిత్య, పెద్దమ్మ కూతురు అక్షరతో కలిసి వెళ్లారు. ఈ క్రమంలో నవ్యశ్రీ, నిత్య, అక్షర, తమ్ముడు హర్షవర్ధన్ సరదాగా చెరువు నీటిలోకి దిగారు. వీరు దిగిన చోట లోతైన జేసీబీ గుంత ఉండటంతో ఈత రాక నీటిలో మునిగారు. గమనించిన తల్లి భవాని కాపాడండి అంటూ అరవడంతో పక్కనే ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తి వచ్చి బయటకుతీశాడు. అప్పటికే నీరు మింగిన నవ్యశ్రీ మృతిచెందగా మిగిలిన ఇద్దరిని ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతున్నారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే కూతురు చనిపోయిందన్న వార్త విన్న తండ్రి తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరినట్లు స్థానికులు తెలిపారు. సరదాగా బడికి వెళ్లి చదువుకోవాల్సిన బాలిక ప్రమాదవశాత్తు చెరువు మింగేయడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. 5వ తరగతి వరకు చదివిన చోటే 6వ తరగతిలో చేర్పించినా తమ కూతురు బతికి ఉండేదేమోనని కుటుంబ సభ్యులు కంటతడి పెట్టుకున్నారు.

ప్రేమను పెద్దలు అంగీకరించలేదని..

- ప్రేమ జంట ఆత్మహత్య
- అవుసులోనిపల్లిలో విషాదం



కల్పన



శివకుమార్

వర్గల్(గజ్వేల్): తమ ప్రేమను పెద్దలు అంగీకరించడం లేదన్న మనస్తాపంతో ప్రేమ జంట బలవన్మరణం చెందారు. ఈ విషాదకర ఘటన మంగళవారం వర్గల్ మండలం అవుసులోనిపల్లిలో చోటుచేసుకున్నది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన చెక్కల ఆంజనేయులు, మణెమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు కల్పన(18) ఉంది. కల్పన ఇంటర్మీడియెట్ చదివి ఇంటి వద్దే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన ఉప్పరి మల్లేశం, మంజుల దంపతులది వ్యవసాయ కుటుంబం. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు శివకుమార్ (21) ఉన్నారు. ఒకే గ్రామానికి చెందిన కల్పన, శివకుమార్ కొంతకాలం నుంచి ప్రేమించుకుంటున్నారు. కుటుంబీకులు వారి ప్రేమను అంగీకరించలేదు. మరోవైపు కూతురు వివాహం కోసం సంబంధం కుదుర్చుకునే పనిలో నిమగ్నమయ్యాడు. ఈ నేపథ్యంలో తమ ప్రేమ విఫలమైందని కల్పన, శివకుమార్ మనస్తాపానికి గురయ్యారు. మంగళవారం ఉదయం శివకుమార్ తన వ్యవసాయ క్షేత్రంలో చెట్టుకు ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. ఈ విషయం తెలిసిన కొద్ది వ్యవధిలోనే కల్పన తన ఇంట్లో పైకప్పు పైపునకు చున్నీతో ఉరివేసుకుంది. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇరు కుటుంబాలు దుఃఖసాగరంలో మునిగిపోయాయి. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గజ్వేల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబీకులకు అప్పగించారు.

మానవత్వం చాటుకున్న గ్రామస్తులు

- కొడకండ్లలో అనారోగ్యంతో అనాథ మృతి
- చందాలతో అంత్యక్రియలు



అనాథ వ్యక్తి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో అనాథ మృతి చెందగా గ్రామస్తులు కలిసి చందాలు వేసుకొని అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటారు. ఈ ఘటన గజ్వేల్ మండలం కొడకండ్లలో మంగళవారం జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం... ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చెందిన స్వామి(55) ఉపాధి కోసం గజ్వేల్ మండలం కొడకండ్లలోని ఓ ప్రైవేటు కంపెనీలో పెయింటింగ్ వర్క్ కోసం 18ఏళ్ల క్రితం వచ్చి ఇక్కడే ఉండిపోయాడు. ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతున్న స్వామి మంగళవారం మృతి చెందాడు. అతడికి కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్‌తో పాటు యువకులు, దాతల సహకారంతో చందాలు వేసుకొని అంత్యక్రియలు నిర్వహించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

వివాహిత ఆత్మహత్య



భూక్య శ్రావణి(ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు తట్టుకోలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన అక్కన్నపేట మండలం మల్‌చెర్వుతండా గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌భాస్కర్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన భూక్య వసరాంతో కోహెడ మండలం, బస్వాపూర్ గ్రామ పరిధిలోని ఆరెపల్లితండాకు చెందిన ధరావత్ రాజు కుమార్తె భూక్య శ్రావణి(25)తో ఐదేళ్ల క్రితం రూ.5లక్షల కట్నకానుకలతో ఘనంగా వివాహం చేశారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొద్దినెలలు సజావుగా ఉన్న వీరి సంసారంలో అదనపు కట్నం తేవాలని భర్త, అత్త వేధింపులకు గురిచేసేవారు. ఈ విషయం శ్రావణి తన తల్లిదండ్రులకు చెప్పగా పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి మరో రూ.లక్ష అదనంగా ఇచ్చారు. అయినప్పటికీ వేధింపులు కొనసాగుతుండటంతో మంగళవారం తెల్లవారుజామున పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ క్రమంలో తండావాసులు, కుటుంబీకులు హుటాహుటిన అంబులెన్స్‌లో హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి ధరావత్ రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అలంకారప్రాయంగా సీడీసీ

- రెండు సీజన్లలో 'ట్రైడెంట్' మూత ఫలితం
- పక్క కర్మాగారాలకు తరలిన చెరకు
- రెండేళ్లుగా కోల్పోయిన ఆదాయం



జహీరాబాద్‌లో సీడీసీ కార్యాలయం

జహీరాబాద్: జహీరాబాద్‌లోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారం 2023–24, 2024–25 క్రషింగ్ సీజన్‌లో చెరకును క్రషింగ్ నిర్వహించకపోవడంతో మూతపడింది. దీంతో కేన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(సీడీసీ)కు రావాల్సిన నిధులు రాకుండా పోయాయి. జోన్ పరిధిలో ప్రతి ఏటా సుమారు 7లక్షల టన్నుల మేర చెరకు ఉత్పత్తి అవుతుంది. ట్రైడెంట్ మూతపడటంతో జోన్ పరిధిలో రైతులు పండించిన చెరకు పంటను పక్క జిల్లాల్లోని కర్మాగారాలతో పాటు పక్క రాష్ట్రాలకు తరలించారు. దీంతో రెండేళ్లుగా సుమారు రూ.కోటి మేర సీడీసీ కార్యాలయం నిధులను కోల్పోవాల్సి వచ్చింది. చెరకు పంట టన్నుకు రూ.4 చొప్పున యాజమాన్యాలు రైతుల బిల్లుల నుంచి మినహాయించుకుని, యాజమాన్యం సైతం తనవంతు వాటా కింద టన్నుకు రూ.4 చొప్పున సీడీసీ ఖాతాల్లో జమ చేస్తాయి. ఇరువురి వాటా కలిపి టన్నుకు రూ.8 చొప్పున నిధులు సమకూరుతాయి. ఈ నిధుల నుంచి కేన్ అధికారులు చెరకు రైతులకు సబ్సిడీపై గడ్డి మందులు, ఇతర యంత్ర పరికరాలను అందజేస్తారు. అవసరమైతే పొలాలకు వెళ్లేందుకు వీలుగా తాత్కాలిక రోడ్ల మరమ్మతులు చేపడతారు. రెండేళ్లుగా ట్రైడెంట్ కర్మాగారం మూతపడటంతో జహీరాబాద్ సీడీసీకి నయా పైసా నిధులు రాకపోవడంతో సబ్సిడీ పథకాలను నిలిపివేశారు. దీంతో జహీరాబాద్ జోన్ చెరకు రైతులకు మాత్రం నిరాశే మిగిలింది.

పక్క కర్మాగారాల రైతులకే లబ్ధి

జహీరాబాద్ నియోజకవర్గం నుంచి పక్క కర్మాగారాలకు చెరకు ఉత్పత్తులు తరలడంతో ఆయా కర్మాగారాల పరిధిలో ఉన్న సీడీసీలకే నిధులు జమ అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి 2024–25 సీజన్‌కు గాను కొత్తగా ప్రారంభించిన రాయికోడ్‌లోని మాటూరు చక్కెర కర్మాగారానికి 1.15లక్షల టన్నుల చెరకు ఉత్పత్తులను రైతులు తరలించారు. సంగారెడ్డిలోని గణపతి చక్కెర కర్మాగారానికి 1.80లక్షల టన్నులు, మహబూబ్‌నగర్‌లోని కొత్తకోట కర్మాగారానికి 70వేల టన్నులు, నారాయణఖేడ్‌లోని మాగి కర్మాగారానికి 75వేలు, కామారెడ్డిలోని చక్కెర కర్మాగారానికి 75వేల టన్నుల చెరకు పంట క్రషింగ్ నిమిత్తం జహీరాబాద్ జోన్ నుంచి తరలి వెళ్లింది. పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్రకు సైతం సుమారు 2లక్షల టన్నుల మేర చెరకు వెళ్లింది. ఇలా పక్క ప్రాంతాలకు తరలివెళ్లిన చెరకు పంటతో జహీరాబాద్ సీడీసీకి గత రెండేళ్లుగా సుమారు రూ.కోటి మేర ఆదాయం రాకుండా పోయింది.

కుదించుకుపోయిన జోన్ పరిధి

జహీరాబాద్ చెరకు జోన్ పరిధి కుదించుకుపోయింది. ట్రైడెంట్ కర్మాగారం మూత పడటం వల్ల జోన్ పరిధిని కుదించి కొత్తగా మాటూర్ జోన్‌ను ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన గోదావరి–గంగా చక్కెర కర్మాగారం జోన్ పరిధిలోకి కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, రాయికోడ్, వట్‌పల్లి మండలాలను చేర్చారు. దీంతో జహీరాబాద్, మొగుడంపల్లి మండలాలు మాత్రమే ప్రస్తుతం పాత జోన్ పరిధిలో మిగిలి ఉన్నాయి.

పేరుకే కార్యాలయం

జహీరాబాద్‌లో సీడీసీ కార్యాలయం పేరుకే ఉంది. జోన్ పరిధిలో కర్మాగారాలు లేకపోవడంతో కార్యాలయం పరిస్థితి నిస్తేజంగా మారింది. కొత్తగా రాయికోడ్ కేన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఏర్పడిందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. మాటూర్‌లో గోదావరి–గంగా చక్కెర కర్మాగారం కొత్తగా ఏర్పడటంతో ప్రస్తుతం రాయికోడ్ సీడీసీ కార్యకలాపాలు జహీరాబాద్ కార్యాలయం ద్వారానే కొనసాగుతున్నాయి.